E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :65 గురువారం 06 ఆగస్టు 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-



# ఏపీ ఎజెండా
## తెలంగాణ ఆందోళన

- జీఆర్ఎంబీ ఎజెండాపై హరీశ్ ఫైర్
- రేవంత్ మౌనం ఎందుకని ప్రశ్న
- ఏపీ కుట్రలకు కాంగ్రెస్ సహకారమా?
- ఏడు ప్రాజెక్టులపై రద్దు కుట్ర
- తెలంగాణ హక్కులపై దాడి: హరీశ్
- 'గురుదక్షిణ' కోసమే మౌనమా?
- బీజేపీ వెంటనే స్పందించాలి
- ప్రాజెక్టుల రద్దు అంటే రాష్ట్రానికే నష్టం
- పోరాటానికి సిద్ధం: బీఆర్ఎస్ హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ద్రోహం తలపెట్టాలని చూస్తే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టు అనుమతులపై పక్క రాష్ట్రం కుట్రలు చేస్తుంటే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహిస్తూ రాష్ట్ర ప్రయోజనాలకు ఉరివేస్తోందని ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18న జరగబోయే గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాను చూస్తే అది కేవలం ఏపీ కోసమే జరుగుతున్నట్లు అనిపిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిపై సాధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తే, వాటిని జీఆర్ఎంబీ తన ఎజెండాలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

# తెలంగాణ అభివృద్ధి అజెండాతో
# ఢిల్లీలో కీలక భేటీలు

## సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య


**తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ, ఆగస్టు 5**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పలు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ భేటీల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కూడా పాల్గొన్నారు.

ముందుగా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కలిశారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో సమావేశమై తెలంగాణకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఇతర ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రయోజనాల అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రత్యేకంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని ఈ సమావేశాల్లో కోరినట్లు తెలిపారు.



# లోన్‌దారులకు ఆర్‌బీఐ గుడ్‌న్యూస్



2 లో

- రెపో రేటును 5.25 శాతానికే పరిమితం చేసిన ఆర్‌బీఐ
- హోమ్, ఆటో, పర్సనల్ లోన్ల ఈఎంఐలకు ఊరట
- ఎంపీసీ ద్వైమాసిక సమీక్షలో కీలక నిర్ణయం
- న్యూట్రల్ విధానాన్ని కొనసాగిస్తున్న ఆర్‌బీఐ
- ద్రవ్యోల్బణం, వృద్ధిని దృష్టిలో ఉంచుకున్న నిర్ణయం
- భౌగోళిక ఉద్రిక్తతల మధ్య స్థిరత్వానికే ప్రాధాన్యం

# జంతర్ మంతర్ నిరసనల్లో టెర్రరిస్ట్‌లు

- ఐఎస్ఐ కుట్ర భగ్నం
- తొమ్మిది మంది అరెస్ట్
- జంతర్‌మంతర్ లక్ష్యంగా కుట్ర
- పెట్రోల్ బాంబుల స్వాధీనం
- నలుగురు మైనర్లు అదుపులో
- విదేశీ ఫండింగ్‌పై దర్యాప్తు



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** పంజాబ్ పోలీసులు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కుట్రను భగ్నం చేస్తూ ఓ భారీ ఉగ్ర నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఐఎస్ఐ ఆదేశాలతో దేశంలో ఉగ్ర దాడులకు ప్లాన్ చేస్తున్నారనే ఆరోపణలతో అమృత్‌సర్ పోలీసులు ఇద్దరు వేర్వేరు ముఠాలకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు మైనర్లు ఉండటం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం.. ఈ అనుమానితుల నుంచి పెట్రోల్ బాంబులు (బోటిల్ బాంబులు), పిస్టళ్లు, సజీవ తులసి గుండ్లు (కార్ట్రిడ్జ్‌లు), లైటర్లు, ఇతర అనుమానాస్పద పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెట్‌వర్క్ మూలాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వరకు విస్తరించినట్లు విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టయిన వారిలో ఒకడు తన సహచరులతో కలిసి జంతర్ మంతర్ వద్దకు వెళ్లాడని, అక్కడ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఉగ్ర దాడికి కుట్ర పన్నినట్లు తేలింది. వీరికి ఉత్తరప్రదేశ్ నివాసి ఒకరి ద్వారా ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమకూర్చడానికి ఐఎస్ఐ హ్యాండ్లర్లు ప్రయత్నించినప్పటికీ, భద్రతా సంస్థల అప్రమత్తత వల్ల వారి ప్లాన్ విఫలమైంది. దాంతో వారు తిరిగి పంజాబ్ చేరుకున్నారు.

2 లో

# డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచన
- రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- జాబ్ క్యాలెండర్ ప్రకారమే డీఎస్సీ హామీ
- అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు
- డిసెంబర్‌లో పరీక్షల నిర్వహణకు చర్యలు
- 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విజయవంతం
- ఉపాధ్యాయ నియామకాలపై ప్రభుత్వం కట్టుబాటు

2 లో

# మహేష్ వ్యాఖ్యలపై హరీష్ న్యాయపోరాటం

- మహేష్‌కు లీగల్ నోటీసులు
- హరీశ్ రావు చర్యలు
- వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి
- బహిరంగ క్షమాపణ డిమాండ్
- కోర్టు చర్యల వార్నింగ్
- క్షుద్రపూజల వ్యాఖ్యల వివాదం



2 లో

# జేపీఎస్సీ వివాదంపై సీఎం హామీ

- దీక్షను విరమించిన దేవేంద్ర నాథ్ మహతో
- సోనమ్ వాంగ్‌చుక్ సూచనతో నిర్ణయం
- పేపర్ లీక్, అక్రమాలపై విద్యార్థుల ఆందోళన కొనసాగింపు
- ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్
- సీబీఐ, స్వతంత్ర కమిటీతో విచారణ కోరిన నిరసనకారులు
- దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని సీఎం హామీ
- జేపీఎస్సీ, జేఎస్ఎస్సీలో సంస్కరణలు చేపట్టాలని విజ్ఞప్తి

2 లో

# 3,000 కోట్ల కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు.. నేరుగా సోదాలు
- హైదరాబాద్, విశాఖలో ఐదు ప్రాంతాల్లో తనిఖీలు
- రూ.3,000 కోట్ల ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు
- డిపాజిటర్ల నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- కీలక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, హార్డ్‌డిస్క్‌ల పరిశీలన
- బిహార్ ఈడీ బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోదాలు

2 లో

## డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రారంభమైన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభ్యర్థులకు ట్విట్టర్ వేదికగా బెస్ట్ విషెస్ తెలియజేశారు. అభ్యర్థులందరూ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతున్న టెట్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారమే డీఎస్సీ..

అయితే, ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ మేరకే తదుపరి డీఎస్సీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తదుపరి డీఎస్సీకి సంబంధించి అక్టోబర్‌లో నోటిఫికేషన్ వెలువడనుండగా, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ వేగంగా చర్యలు చేపడుతోంది. కాగా, ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ పోస్టులతో కూడిన 'మెగా డీఎస్సీ' ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని నారా లోకేష్ ప్రస్తావించారు.

## హైడ్రాలో ఫోర్జరీ కలకలం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** హైదరాబాద్ మహానగరంలో అత్యంత శక్తివంతమైన ఏజెన్సీగా మారిన హైడ్రా పేరుతో భారీ అక్రమాలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహా ఉన్నతాధికారుల సంతకాలను ఓ ముఠాగా ఏర్పడి ఫోర్జరీ చేసినట్లుగా తేలింది. ఏకంగా 8 ప్రముఖ ప్రైవేటు కళాశాలలు ఈ ఫోర్జరీ సంతకాలు, నకిలీ ఎన్ఓసీల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించడం అధికారులను ఒక్కసారిగా షాకింగ్‌కు గురిచేసింది.

నకిలీ ఫైర్ ఎన్వోసీల సృష్టి

అయితే, 'హైడ్రా' నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే, కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్వోసీ సర్టిఫికెట్లను తయారు చేశారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. నకిలీ ఎన్ఓసీ పత్రాలనే ఇంటర్మీడియట్ విద్యారంగంలో అఫిలియేషన్ పొందేందుకు సదరు 8 ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ క్రమంలోనే ఎన్వోసీ పరిశీలన సమయంలో సదరు సర్టిఫికెట్లు పూర్తిగా ఫేక్ అని.. వాటిపై ఉన్న కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయబడిందని 'హైడ్రా', ఇంటర్ బోర్డు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ మొత్తం వ్యవహారంపై 'హైడ్రా' యంత్రాంగం అలర్ట్ అయి కఠిన చర్యలకు పూనుకుంది. ఫోర్జరీకి పాల్పడిన మొత్తం 8 ప్రైవేటు కాలేజీల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైడ్రా అడిషనల్ డైరెక్టర్లే లేక్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు.

ఫోర్జరీకి పాల్పడిన కాలేజీల జాబితా ఇదే..

1. హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర.
2. రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్.
3. ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం.
4. మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్.
5. శ్రీ చైతన్య జూనియర్, చంద్రాయణగుట్ట.
6. న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి.
7. షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి.
8. వశిష్ఠ జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

## లోన్‌దారులకు ఆర్‌బీఐ గుడ్‌న్యూస్



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** దేశంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత రిజర్వ్ బ్యాంక్ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. ద్రవ్య పరపతి విధాన కమిటీ ద్వైమాసిక సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ప్రామాణిక వడ్డీ రేటైన రెపో రేటును 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచాలని గవర్నర్ నేతృత్వంలోని ఎంపీసీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచకపోవడంతో హోమ్ లోన్లు, ఆటో లోన్లు, పర్సనల్ లోన్లు తీసుకున్న వారి నెలవారీ ఈఎంఐలు పెరిగే అవకాశం లేదు. భవిష్యత్ పరిస్థితులు, ధరల స్థిరత్వాన్ని బట్టి నిర్ణయం తీసుకునేలా ఆర్‌బీఐ తన విధాన వైఖరిని న్యూట్రల్ గానే పునరుద్ఘాటించింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల మధ్య దేశీయ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు.

## జేపీఎస్‌సీ వివాదంపై సీఎం హామీ




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** ఝార్ఖండ్‌లో జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలపై కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ క్రమంలో ఆగస్టు 2 నుంచి రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో తాజాగా దీక్ష విరమించారు.

అంతకుముందు పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దీక్షను విరమించాలని సూచించారు. ఆయన హామీతో మహతో ముందుగా నీరు, ఉప్పు స్వీకరించి ఆందోళన కొనసాగించగా, అనంతరం దీక్షను ముగించారు. వాంగ్‌చుక్ మద్దతుతో నిరసనకారుల్లో ఉత్సాహం పెరిగిందని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనను మాత్రం విరమించేది లేదని మహతో స్పష్టం చేశారు.

జూలై 5న ప్రకటించిన 14వ జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీలో సంస్కరణలు చేపట్టడం, నియామక అవకతవకలపై సీబీఐ లేదా రాష్ట్రానికి వెలుపలి హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ జరపాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, దర్యాప్తు పూర్తయ్యాక తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీ ఇచ్చారు.

## 3,000 కోట్ల కుంభకోణం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఊహించని షాకిచ్చింది. ఈ మేరకు బుధవారం తెల్లవారుజాము నుంచి ఆయన నివాసాలు, కార్యాలయాలపై ఈడీ టీమ్స్ మెరుపు దాడులకు దిగాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన ఈడీ అధికారుల బృందం హైదరాబాద్, విశాఖపట్నంలోని ఐదు విభిన్న ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు చేపట్టడం తీవ్ర కలకలం రేపింది. మళ్ల విజయప్రసాద్ వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆర్థిక అవకతవకలు, డిపాజిట్ల సేకరణలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ దాడులు జరిగాయి. డిపాజిటర్ల నుంచి పెద్ద ఎత్తున నిధులు సేకరించి, నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు రూ.3,000 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. విజయ ప్రసాద్ నివాసాలతో పాటు కంపెనీ కార్యాలయాల్లోని కీలక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, హార్డ్‌డిస్క్‌లు, డిజిటల్ సాక్ష్యాలను అధికారులు ఒక్కొక్కటిగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

## హింసాత్మక చర్యలొద్దు సుప్రీంకోర్టు కీలక సూచన

**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** శాంతియుత నిరసనలు తెలిపే యువ విద్యార్థుల పట్ల అధికారులు, భద్రతా దళాలు అత్యంత సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. హింసను అదుపు చేసేందుకు బలగాల ద్వారా హింసాత్మకంగా ప్రతిస్పందించడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయపడింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన నిరసనల సమయంలో చోటుచేసుకున్న రాళ్లదాడి, హింసాత్మక ఘటనలపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా మార్చ్‌లు చేసే



యువత పట్ల భద్రతా దళాలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వారిని రెచ్చగొట్టి హింస వైపు మళ్లకుండా చూడాలని సీజేఐ సూర్య కాంత్ స్పష్టం చేశారు.

వారి అభ్యర్థలను వినండి మొదలు..

అయితే, ఆందోళ చేస్తున్న యువత ఎందుకు ఆందోళన చేస్తున్నారు? వారు ఏమి చెబుతున్నారో వినడమే అత్యంత శక్తివంతమైన పరిష్కారామని సుప్రీం ధర్మాసనం కామెంట్ చేసింది. తాము చెబితే వినాలని, పరిస్థితులను ఎలా అదుపు చేయాలో న్యాయ పరిరక్షణ సంస్థలకు బాగా తెలుసని, వారి విచక్షణకే ఈ వ్యవహారాన్ని వదిలేస్తున్నామని కోర్టు కామెంట్ చేసింది. అదేవిధంగా రాజధాని ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో విద్యార్థుల నిరసనల హింసపై పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో అన్ని అంశాన్ని కలిపి విచారిస్తామని, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## మహేష్ వ్యాఖ్యలపై హరీష్ న్యాయపోరాటం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లీగల్ నోటీసులు పంపారు. తెలంగాణ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకే హరీశ్ రావు పలు ఆలయాలను సందర్శించి క్షుద్రపూజలు, చేతబడులు చేశారంటూ ఇటీవల మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన సంచలన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించారు. మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమైనవి, నిరాధారమైనవి మరియు సమాజంలో తనకున్న వ్యక్తిగత ప్రతిష్ఠను, రాజకీయ పరువును తీవ్రంగా భంగపరిచేలా ఉన్నాయని హరీశ్ రావు తరఫు న్యాయవాది పంపిన లీగల్ నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రత్యర్థులపై రాజకీయ ప్రయోజనాల కోసం, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇటువంటి దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేశారని, తనపై చేసిన తప్పుడు ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ నోటీసుల ద్వారా డిమాండ్ చేశారు.

తెలంగాణ రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల స్థాయిని పూర్తిగా దిగజార్చేలా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు ఉన్నాయని లీగల్ నోటీసుల్లో విమర్శించారు. ఒక ప్రజాప్రతినిధిగా, నిత్యం దైవచింతనతో ఆలయాలను సందర్శించడాన్ని వక్రీకరించి, దానికి క్షుద్రపూజల రంగు పులిమి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇదే తరహాలో తనపై అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేసినందుకు గానూ ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్ రెడ్డిలకు కూడా లీగల్ నోటీసులు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా నోటీసుల్లో ప్రస్తావించారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ఒక నాయకుడి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా అసత్య ఆరోపణలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అందువల్ల మహేష్ కుమార్ గౌడ్ తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుంటూ స్పష్టమైన ప్రకటన విడుదల చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సివిల్ మరియు క్రిమినల్ పరువు నష్టం చట్టాల కింద తదుపరి కోర్టు చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## జంతర్ మంతర్ నిరసనల్లో టెర్రరిస్టులు

మొదటి పేజీ తరువాయి

ఈ రెండు ముఠాల్లో మొదటి దానికి సంబంధించి రాజస్థాన్‌కి చెందిన సుఖ్‌మన్ సింగ్‌తో పాటు ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నాలుగు బాటిల్ బాంబులు, రెండు పిస్టళ్లు, తొమ్మిది కార్ట్రిడ్జ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిరంతరం సంబంధంలో ఉన్న సుఖ్‌మన్, పంజాబ్‌లోని పోలీస్ భవనాలు, పోలీసుల కదలికలపై నిఘా ఉంచేందుకు రెక్కీ నిర్వహించినట్లు ఒప్పుకున్నాడు. ఇక రెండో ముఠా రైల్వే ట్రాక్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ దృశ్యాలను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు పంపుతున్నట్లు గుర్తించారు. జోడా ఫాటక్ సమీపంలో రైల్వే ట్రాక్ స్తంభానికి కెమెరా అమర్చిన ఘటనలో మోహకంపూరాకు చెందిన వంశీ కుమార్‌తో పాటు ఓ మైనర్‌ను అరెస్ట్ చేసి పిస్టల్, కెమెరాలు, దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సున్నితమైన మిలిటరీ ప్రాంతాల సమాచారాన్ని విదేశాలకు చేరవేస్తున్నారనే కోణంలో జీఆర్పీ కూడా వీరిని విచారిస్తోంది.

ఈ కుట్ర వెనుక ఉన్న మిగతా లింకులను దర్యాప్తు చేస్తూ పోలీసులు అనమోల్ సింగ్ అనే వ్యక్తితో పాటు, ఆయుధాల చట్టం కింద ఇదివరకే జైలులో ఉన్న సుఖ్‌దేవ్ సింగ్, హర్మాన్ సింగ్‌లను కూడా ప్రొడక్షన్ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో 19 ఏళ్ల వంశీ కుమార్, 24 ఏళ్ల హర్మాన్ సింగ్ (టీ షాప్ వర్కర్), 30 ఏళ్ల సుఖ్‌దేవ్ సింగ్ (డ్రైవర్), 20 ఏళ్ల అన్మోల్ సింగ్, 19 ఏళ్ల సుఖ్‌మన్ సింగ్ (ట్రాక్టర్ డ్రైవర్)లతో పాటు నలుగురు మైనర్లు ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడి, చదువు మధ్యలోనే ఆపేసిన ఈ మైనర్లకు చిన్న చిన్న ఆశలు చూపి, పెట్రోల్ బాంబులు తయారు చేయడం నేర్పించి దేశవ్యతిరేక కార్యకలాపాల్లోకి దించినట్లు అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్ ప్రీత్ సింగ్ భుల్లార్ వెల్లడించారు. విదేశీ ఫండింగ్, స్థానిక సహకారం, ఆయుధాల సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవడానికి దర్యాప్తు తీవ్రతరం చేశారు.



## కస్తూర్బా గాంధీ టీచర్లపై సస్పెన్షన్ వేటు!



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** పిల్లలకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు దారితప్పారు. ఏకంగా విద్యార్థినులతోనే వ్యక్తిగత పనులు, మసాజ్‌లు చేయించుకుని అడ్డంగా బుక్కయ్యారు. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం, నంబులపూలకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ రూపా రాణి.. ఇద్దరు విద్యార్థినులతో తన తలకు కొబ్బరి నూనె రాయించుకుని మసాజ్ చేయించుకున్నారు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న కొందరు రహస్యంగా ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపాయి.

తల్లిదండ్రుల ఆగ్రహం.. అధికారుల చర్యలు : ఈ ఫోటోలు వైరల్ కావడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువులు పిల్లలతో ఇలాంటి పనులు చేయించుకోవడంపై మండిపడ్డారు. ఘటనపై వెంటనే స్పందించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు.. ప్రాథమిక విచారణకు ఆదేశించారు. వాస్తవాలను నిర్ధారించుకున్న అనంతరం బాధ్యులైన హిందీ టీచర్ రూపారాణితో పాటు, ప్రిన్సిపల్ రెహానాను విధుల నుంచి తొలగిస్తూ సస్పెన్షన్ వేటు వేశారు.

## ఏపీ ఎజెండా.. తెలంగాణ ఆందోళన

మొదటి పేజీ తరువాయి

'గురుదక్షిణ' చెల్లించేందుకేనా ఈ మౌనం?:

తెలంగాణ ప్రాజెక్టును వ్యతిరేకించలేదని అంటూనే తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారని చంద్రబాబు మాటలు నిజమా లేక లేఖలు నిజమా అని హరీశ్ రావు ప్రశ్నించారు. చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన లేదని, పక్క రాష్ట్రం కుట్రలు పన్నుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. గురుదక్షిణ చెల్లించడం కోసమే మౌనంగా ఉన్నారా అని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలు సమాధి కట్టేవిధంగా ఏపీ కుట్రలు చేస్తోందని. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ గొంతుకోయాలని చూస్తున్నారని ఆరోపించారు.


బీజేపీ స్పందించాలి:

గోదావరిపై కేసీఆర్ ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తేస్తే వాటిని రద్దు చేయాలని ఏపీ డిమాండ్ చేస్తోందని, భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారి తెలంగాణకు ఇచ్చిన ఏడు ప్రాజెక్టుల అనుమతులపై రివ్యూ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే వాటిని జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చిందన్నారు. అంటే కుక్క తోకను ఆడిస్తోందా లేక తోక కుక్కను ఆడిస్తోందా? కేంద్ర ప్రభుత్వం పెద్దదా లేక జీఆర్ఎంబీ పెద్దదా అని నిలదీశారు. అజెండా సెట్ చేసే ధైర్యం ఏపీకీ, జీఆర్ఎంబీకి ఎక్కడిది అన్నారు. దీనిపై బీజేపీ ఆలోచించాలన్నారు. చంద్రబాబుకు భయపడి బీజేపీ స్పందించకుంటే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు.

రద్దు అంటే రాష్ట్రానికి అన్యాయమే:

కాళేశ్వరం అనుమతులు రద్దు అంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమేనని, సీతారామ అడ్డుకోవడమంటే ఖమ్మం జిల్లాకు అన్యాయం చేయడమేనన్నారు. తెలంగాణలో తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని చెప్పడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని, గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదని విమర్శించారు.

## డయల్ 100 స్థానంలో కొత్త ఎమర్జెన్సీ నంబర్.. 112 ప్రారంభించిన డీజీపీ




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలో ఇకపై అన్ని ఎమర్జెన్సీ సేవలకు ఒకే నంబర్ ఉపయోగంలోకి వచ్చింది. డయల్ 100 స్థానంలో కొత్తగా నంబర్ ను పోలీస్ శాఖ తీసుకువచ్చింది. అంబులెన్స్, పోలీస్, అగ్నిమాపక, ఇతర సర్వీసుల కోసం ఇకపై డయల్ 112 నంబర్?ను తీసుకువచ్చింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ లో డీజీపీ సీవీ ఆనంద్ ఈ నూతన ఎమర్జెన్సీ కాల్ సెంటర్ ను ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు వేర్వేరు సేవలకు వేరు నంబర్లతో ఉన్న సేవలను ఇకపై ఒకే గొడుకు కిందకు రానున్నాయి. రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దోపిడీలు, వేధింపులు వంటి అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు కాల్ చేస్తే వెంటనే సహాయం లభిస్తుందని డీజీపీ తెలిపారు.

24/7 అందుబాటులో:

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కాల్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేశామని డయల్ 112కు కాల్ వచ్చిన వెంటనే సమాచారం సమీప పోలీస్ స్టేషన్ కు చేరవేస్తారని డీజీపీ చెప్పారు. కొత్త ఎమర్జెన్సీ నంబర్ 24 గంటలు, 365 రోజులు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ కాల్ రాగానే కాలర్ లొకేషన్ గుర్తించి దగ్గర్లోని పోలీస్, ఫైర్ రెస్పాన్స్ టీమ్ లకు సమాచారం చేరుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ ను మరింతగా తెలంగాణ పోలీసు ఉపోయగించుకోబోతోందన్నారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపు

**తెలుగు గళం న్యూస్ జనగామ, ఆగస్టు 5**

తెలంగాణలో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న "అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర"ను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.బుధవారం జనగామలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, పాపన్న పాలించిన కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, నెలవారీ పింఛన్‌ను రూ.4,000కు పెంచాలని డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య






మాట్లాడుతూ, 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామానికి జీవో 560 ప్రకారం 5 ఎకరాల భూమి కేటాయించాలని, సాధ్యం కాకపోతే కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.సభ్యత్వం ఉన్న ప్రతి గీత కార్మికునికి ప్రమాద బీమా, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని, వృత్తి నిర్వహించే ప్రతి గీత కార్మికునికి బైక్‌లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆగస్టు 2న మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ చైతన్య బస్సు యాత్ర ఆగస్టు 18 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి గీత కార్మికులు, నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో బైక్‌లతో పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, బండపల్లి శంకరయ్య, మాచర్ల రఘురాములు, జిల్లా కమిటీ సభ్యులు బాల్నే ఉమాపతి, బస్వగోని మహేందర్, కమ్మగాని పరశురాములు, తాళ్లపెల్లి మదర్, కుర్ర రాజు, నామాల యాదగిరి, వడ్లకొండ వెంకటేష్, యాదాండ్ల పరంధాములు, పోతుగంటి కృష్ణమూర్తి, మూల కిరణ్, సోషల్ మీడియా కన్వీనర్ మూల వైకుంఠం, పోతుల ఆంజనేయులు, కుర్ర మధు తదితరులు పాల్గొన్నారు.

# మీరాలం మండిలో మహంకాళికి మహోత్సవం

## 15 క్వింటాళ్లతో శాకంబరి పూజల వైభవం!



**తెలుగు గళం** :పచ్చని ప్రకృతి దివ్యానుగ్రహానికి ప్రతీకగా, నగర భక్తజన హృదయాలలో ఆధ్యాత్మిక కాంతులు విరజిమ్ముతూ చార్మినార్ పరిధిలోని మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం దివ్య శోభతో అలరారింది. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మహంకాళేశ్వరి అమ్మవారికి శాకంబరి అలంకార పూజలను అత్యంత భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండువగా నిర్వహించారు. సమస్త జీవకోటికి ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణేశ్వరి స్వరూపంగా అమ్మవారు పచ్చని శాకంబరీ దేవిగా దర్శనమివ్వడంతో భక్తులు మైమరిచిపోయారు.

# తేజశ్రీ కుటుంబాన్ని పరామర్శించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం -- బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా

## మృతురాలికి ఘన నివాళులు అర్పించిన పార్టీ నాయకులు







**తెలుగు గళం ములుగు, వెంకటాపురం:**

పాలంపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కనకం సంపత్ కుమార్తె తేజశ్రీ ఇటీవల జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందడం తీవ్ర విషాదానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తేజశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, "ఒక యువ జీవితాన్ని కోల్పోవడం ఎంతో బాధాకరం. ఈ విషాదాన్ని మాటల్లో చెప్పలేం. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తుంది. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా ఉంటాం" అని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# భక్తి, సాంప్రదాయాల నడుమ ఆర్యవైశ్య మహిళల వనభోజనాలు

## రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

## గోరింటాకు వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి





**తెలుగు గళం, నిజామాబాద్ జిల్లా:** పిట్లం మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వనభోజనాలు భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముందుగా పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని సాంప్రదాయాన్ని చాటుతూ ఆనందంగా గడిపారు. వనభోజనాలతో పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మహిళలను ఆకట్టుకున్నాయి. భక్తి, సాంప్రదాయాలు, ఆత్మీయత కలబోసిన ఈ కార్యక్రమం ఆర్యవైశ్య మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది. అందరం వైభవంగా నిర్వహించారు.

# మంచి నాయకుడిని కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు -- జాడి రాంబాబు

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత

## పార్టీ కుటుంబానికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా






**తెలుగు గళం కన్నాయిగూడెం:**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీరీల పాపారావు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల మండల వ్యాప్తంగా తీవ్ర విషాదం నెలకొంది. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడకుల అశోక్ సూచనల మేరకు కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాడి రాంబాబు పార్టీ నాయకులతో కలిసి మృతుడి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చిన జాడి రాంబాబు, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "పాపారావు పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని చివరి వరకు కాంగ్రెస్ జెండాను భుజాన మోసిన నిబద్ధత కలిగిన నాయకుడు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుంది. ఎలాంటి కష్టాలు వచ్చినా పార్టీ కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టదు" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేర్ప పగిడయ్య, తుపాకులగూడెం సర్పంచ్ పీరీల స్వప్న-ప్రేమ్, లక్ష్మీపూర్ సర్పంచ్ అగ్గు రోజా-వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోట నాగేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మాదాసు రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోరం సమ్మయ్య, సంద్ర శేఖర్, సీతారాములు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొని పాపారావుకు నివాళులర్పించారు.

# మార్దండ పాఠశాలకు లయన్స్ క్లబ్ నుంచి 10 బెంచీల విరాళం




**తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :** మార్దండ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 10 బెంచీలను విరాళంగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ బాలు, జోన్ చైర్మన్ నారాయణ, జిల్లా చైర్మన్లు సంజీవరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, కిషన్, చంద్రశేఖర్, ధన్నరపు సంతోష్, అశోక్ గౌడ్, గ్రామ సర్పంచ్ సాయిలు, గ్రామ కార్యదర్శి రాములు, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు రమేష్, దివ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, సాయిలు పటేల్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల నివారణకు అప్రమత్తతే అసలైన రక్షణ

## : అదనపు ఎస్పీ మనన్ భట్, ఐపీఎస్

## ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం

## ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దు.. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి



**తెలుగు గళం ఏటూరునాగారం :**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, ఏటూరునాగారం పోలీసు శాఖ సహకారంతో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, ఫోన్ కాల్స్ ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్య ప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చి.వెంకటయ్య, డాక్టర్ డి.నవీన్, జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి, రమేశ్, శ్రీధర్, భావన, భారతి, భాస్కర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థినీ--విద్యార్థులు పాల్గొన్నారు.




# ఐకియా జంక్షన్, ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ వద్ద రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణను పరిశీలించిన జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



**తెలుగు గళం, సైబరాబాద్ (ఆగస్టు 5):** నగరంలో పాదచారుల భద్రతతో పాటు ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేసేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఐకియా జంక్షన్ వద్ద పాదచారుల కదలికలు, రవాణా నిర్వహణ చర్యలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. మెట్రో స్టేషన్ మరియు ఇతర ప్రజారవాణా వ్యవస్థల ద్వారా వచ్చే అనేకమంది ప్రయాణికులు కేటాయించిన కాలినడక దారులను ఉపయోగించకుండా, రహదారిపై నిర్ణీత ప్రదేశాలు కాని చోట్ల రోడ్డు దాటుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన గమనించారు. పాదచారుల ప్రాణభద్రత అత్యంత కీలకమని స్పష్టం చేసిన జాయింట్ సీపీ, ప్రజలు తప్పనిసరిగా జెబ్రా క్రాసింగ్స్ వద్ద మాత్రమే రోడ్డు దాటేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారి క్రమశిక్షణను పెంచడానికి, అందరికీ సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన చోట కఠినమైన నిబంధనలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు అమలు చేయాలని స్పష్టం చేశారు.అనంతరం ఐటీసీ ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, వాహనాల రాకపోకలను మరియు ప్రస్తుత రోడ్డు మౌలిక సదుపాయాల సమర్థతను అంచనా వేశారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు మరియు ట్రాఫిక్ నిర్వహణ మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పరిశీలన సమయంలో రహదారిపై అనధికారికంగా పార్క్ చేసిన క్యాబ్‌ల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతుండటాన్ని సీపీ గుర్తించారు. ఆక్రమణగా నిలిపిన వాహనాలను తక్షణమే తొలగించాలని ఆదేశించడంతో పాటు, రహదారులపై ఆటంకాలు లేకుండా చేసేందుకు అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఆదేశించారు. ట్రాఫిక్ ఇంజినీరింగ్, నిబంధనల అమలు, ప్రజా అవగాహన కలసికట్టుగా పనిచేసినప్పుడే రోడ్డు భద్రత సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల సందీప్ రెడ్డి ముందడుగు

**తెలుగు గళం,ప్రేమావతిపేట, రాజేంద్రనగర్:** ప్రేమావతిపేట గ్రామ ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు మరియు పాదచారులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న రహదారి పక్కన ప్రమాదకరంగా పెరిగిన చెట్ల కొమ్మలు, పనిచేయని వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల సందీప్ రెడ్డి ముందుకు వచ్చారు. ఈ సమస్యలపై ఆయన GHMC డిప్యూటీ కమిషనర్, సంబంధిత GHMC అధికారులు మరియు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించి, నిరంతరం వారితో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఫలితంగా రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, వీధి దీపాలు తిరిగి వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి భద్రత మెరుగుపడింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల సందీప్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం నా బాధ్యత. ప్రజాసేవయే నా ప్రధాన లక్ష్యం. ప్రజల సహకారం, అధికారుల వేగవంతమైన స్పందనతోనే ఈ పనులు పూర్తయ్యాయి. ఇందుకు GHMC మరియు విద్యుత్ శాఖ అధికారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. అలాగే తన తదుపరి లక్ష్యంగా యూనివర్సిటీ గ్రౌండ్ నుండి వెటర్నరీ మెయిన్ రోడ్ వరకు ఉన్న రహదారి అభివృద్ధి అంశాన్ని చేపడతానని ఆయన స్పష్టం చేశారు. GHMC, వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెటర్నరీ విశ్వవిద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి యువత నిరంతరం ముందుకు రావాలని, అధికారులతో కలిసి పనిచేస్తే సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని ఆయన పిలుపునిచ్చారు.

## వెంకటాపురంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబుకు ఘన సన్మానం

**పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో లక్ష్మణ్ బాబు సేవలు ప్రశంసనీయం -- నాయకుల కొనియాడింపు**

**లక్ష్మణ్ బాబు నాయకత్వంలో జిల్లాలో బిఆర్ఎస్ ను మరింత బలోపేతం చేస్తాం -- కార్యకర్తల ప్రతిజ్ఞ**



తెలుగు గళం ములుగు, వెంకటాపురం:

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబుకి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘన సన్మానం నిర్వహించారు. గూడూరు సర్పంచ్ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ బాబుకు గులాబీ శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో కాకులమర్రి లక్ష్మణ్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేస్తామని తెలిపారు. కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, తనకు అందించిన ఘన సన్మానం ప్రతి కార్యకర్తకు చెందిన గౌరవమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద నాయక్, మల్క రమేష్, లింగాల రమణారెడ్డి, గయ్ అశోక్, గూడూరు సర్పంచ్ ప్రశాంత్, తవిటి కుమార్, ఓకే రమణారెడ్డి, జవాజు శంకర్, తవిటి శ్రీను, నిమ్మల రవి, ములుగుల దేవేందర్ రెడ్డి, తవిటి బాలకృష్ణ, బూరుగు గట్టయ్య, పెద్దపల్లి రవి, వేల్పుల కృష్ణ, గుజ్జుల భరత్, వేల్పుల భాను, అబ్బ గోపాల్ రెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, కొమరం దనలక్ష్మి, ఎండి



వాలి బాబా, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడ్, జంగాలపల్లి సర్పంచ్, ముడతనపల్లి మోహన్, నర్ర భద్రయ్య, పోరిక అర్జు నాయక్, పోశాల వీరమల్లు, సంపత్ రెడ్డి, జనగాం రవి, ఎర్రబెల్లి గోపాలరావు, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, గుండ్ల రమేష్, అజ్మీర సాదరులాల్, దుర్గం రమణయ్య, చిట్టి మల్ల సమ్మయ్య, కోయిల మహేష్, భాష నాగ రమేష్, కర్ర రవీందర్, లకావత్ నరసింహ నాయక్, అజ్మీర సురేష్, మాలోత్ గాంధీ, తాడూరి రఘు, యలవర్తి శ్రీనివాసరావు, వావిలాల పోచయ్య, గుడిసేవ నాగేశ్వరరావు, గండేపల్లి నరసయ్య, మూగల నరేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమామిడిపల్లిలో గొర్రెలు, మేకలకు సొల్లు టీకాల కార్యక్రమం



తెలుగు గళం న్యూస్
ఐనవోలు ఆగస్టు 05

ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు సొల్లు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్య అధికారి డాక్టర్ గిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టీకాల కార్యక్రమంలో పశుపోషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్ మాట్లాడుతూ, గొర్రెలు, మేకలకు అవసరమైన నట్టల మందును కూడా త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పశువైద్య అధికారులను కోరారు. అలాగే ప్రభుత్వ పశువైద్యశాలలో అటెండర్‌ను నియమించి రైతులకు మెరుగైన సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దద్దు మల్లయ్య, రాజారపు రమేష్, రాజారపు సమ్మయ్య, రాజారపు రాంచంద్రు, డాక్టర్ ఎల్లం ఎల్లేశం తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని పశుపోషకులు టీకాల కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, ఇటువంటి నివారణ చర్యలు పశుసంపద రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

## సమ్మర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు రూ.35 వేల ప్రథమ బహుమతి అందించిన డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్

**క్రీడలతో యువతలో ప్రతిభ వికాసం -- క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు**

**ఏటూరునాగారం క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత**

తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :

ఏటూరునాగారం జడ్పీఎస్ఎస్ పాఠశాల మైదానంలో యువజన ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేత జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.35,000 నగదును ములుగు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు పైడాకుల అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా పైడాకుల అశోక్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మారాం సుమన్ రెడ్డి, గాయాజ్, ఎన్ఎస్‌యూఐ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ షైక్ సద్దాం, టౌన్ యూత్ ప్రధాన కార్యదర్శి రిజ్వాన్, అన్వార్, యువ నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## దీన్ దయాళ్ అంత్యోదయ యోజన ద్వారా మహిళా వ్యాపారులకు శిక్షణ

నల్లగండ (తెలుగు గళం): గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న చిన్న తరహా వ్యాపారాలను అభివృద్ధి చేయడాని దీన్ దయాళ్ అంత్యోదయ యోజన -- నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్) కింద ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అమలు చేస్తుందని నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి వైశాఖ రెడ్డి అన్నారు... నల్లగొండలోని TTDC జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లాలోని DPMలు, APM తదితర సిబ్బందితో తెలంగాణ SERP ఇంక్యుబేటర్ పథకంపై జిల్లా స్థాయి ఓరియెంటెషన్ అండ్ ప్లానింగ్ వర్క్ షాప్ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న గ్రామీణ ప్రాంత సెమి స్కిల్డ్ మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి వారికి వృత్తి నైపుణ్యం పైన శిక్షణను ఇచ్చి వారు చేపట్టిన వ్యాపారాలు నష్టపోకుండా మార్కెట్లో నిలదొక్కుకునేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు... వ్యాపార నిర్వహణ, లాభాలను పెంచుకునే పద్ధతులు, కొత్త వ్యాపార అవకాశాలు, మార్కెటింగ్, వర్కింగ్ క్యాపిటల్, బ్యాంకు రుణాల సదుపాయం వంటి అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందజేస్తారని పేర్కొన్నారు.. రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమం కింద ఎంపికయ్యే 300 వ్యాపారాలకు చాలెంజ్ ఫండ్ మరియు గ్రాంట్ కూడా అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.




## సూరవీడు--4 అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**పుట్టిన గంటలోపే తల్లిపాలు.. తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం: సీడీపీఓ ఆర్.ఇందిరమ్మ**

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం ప్రతి కుటుంబ బాధ్యత: సర్పంచ్ ఇర్ప మురళి**







తెలుగు గళం సూరవీడు, వెంకటాపురం :

సూరవీడు--4 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఆర్.ఇందిరమ్మ మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, తల్లి--బిడ్డ మధ్య అనుబంధం మరింత బలపడుతుందని చెప్పారు. గ్రామ సర్పంచ్ ఇర్ప మురళి మాట్లాడుతూ, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి పలు ఆరోగ్య సూచనలు అందించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేసి, ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు కల్పించేందుకు అందరూ కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొర్స మురళి, వార్డు సభ్యులు పుణ్యం ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ డి.చంద్రకళ, ఏఎన్ఎంలు కృష్ణకుమారి, ఈ.లక్ష్మి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నషాముక్త భారత్



నల్లగొండ (తెలుగు గళం): క్రమశిక్షణతో కూడిన అలవాట్లు యువతకు మంచి భవిష్యత్తును, విజయాన్ని అందిస్తాయనీ సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. మాదకద్రవ్యాల మత్తుతో జీవితం చిత్తు అవుతుందనీ, అందుకే మంచిచెడులను గ్రహించి చెడుకు దూరంగా ఉండాలనీ హితవు పలికారు.. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పోలీసు, సూర్యాపేట బ్రహ్మకుమారిస్ వారి సంయుక్త అధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఏపీనందు జిల్లా ఎస్పి నరసింహ మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నషా ముక్త్ భారత్ అభియాన్ అనే నినాదంతో మాదకద్రవ్యాల, గంజాయి ని సమాజం నుండి వెలివేయడానికి పిలుపునిచ్చారని అన్నారు.. క్రమశిక్షణ తో కూడిన అలవాట్లకు మంచి విజయాలను అందిస్తాయనీ చెప్తూ పేదరికం నుండి కష్టపడి చదివి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతి గా దేశానికి సేవలు అందించిన అబ్దుల్ కలాం విజయం గురించి వివరించారు. డ్రగ్స్ వల్ల విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును కోల్పోకుండా తమకు అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.. .డ్రగ్స్ గురించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో లేదా డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు..

## నష్టపరిహారం చెల్లింపుకై భూములను పరిశీలించిన తెలుగుగంగ అధికారులు

నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం):-బుధవారం రాపూరు మండలం పాత గుండవోలు సచివాలయం ప్రాంగణంలో భూ నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి భూముల పరిశీలన, విచారణ ప్రక్రియపై ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ గ్రామ సభలో న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన దాదాపు 48 మంది రైతులకు చెందిన 104.55 సెంట్ల భూమి నష్టపరిహారం సమస్యను పరిష్కరించే దిశగా ఈ విచారణ చేపట్టారు. అందులో భాగంగా మొదటి విడతగా 30 మంది రైతులకు సంబంధించిన 38.77 ఎకరాల భూమికి సరైన ఆధారాలతో పరిహారం అందేలా అధికారుల బృందం పరిశీలన జరిపింది. సర్వే నెంబర్ 323-సి, 435/ఏ 1 పరిధిలోని భూముల వివరాలను తనిఖీ చేశారు. రైతులు అందజేసే ప్రతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలోని అధికారిక రికార్డులతో సరిచూస్తామని, పూర్తిస్థాయి ఎంక్వైరీ పూర్తయిన తర్వాతే పరిహారంపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎస్డీసి తెలిపారు. విచారణకు నకిలీ లేదా దొంగ కాగితాలు తీసుకొస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లవని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్డీసి హెచ్చరించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించిన అధికారులు, రాబోయే రోజుల్లో మరొకసారి స్వయంగా గ్రామాన్ని సందర్శించి సమగ్ర విచారణ జరుపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాపూరు తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎస్డీసి కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, రాపూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవితేజ, గుండవోలు విఆర్ఓ సుబ్బయ్య, తదితర స్థానిక రెవెన్యూ సిబ్బంది, బాధితులైన రైతులు పాల్గొన్నారు.



## కలువాయి బస్టాండ్ లో నెమలి ప్రత్యక్షం

నెల్లూరు జిల్లా కలువాయి (తెలుగు గళం):- అడవుల్లోనూ.. జలాశయాల ఎగువ భాగం కనుమల్లోనూ.. అరుదుగా కనిపించే నెమలి పురవీధుల్లో పురివిప్పి నాట్యం ఆడుతూ... ప్రత్యక్షమైంది. నిత్యం రద్దీగా ఉండే కలువాయి పట్టణంలోని బస్టాండ్ పరిధిలో, తన సోయగాలతో జనాల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.. ఇది చూసిన జనం ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు...



ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలిచే నెమలి కనుల ముందు ప్రత్యక్షం కావడంతో, ఆనందంతో తిలకించారు... జనాల మధ్య నెమలి కనిపించడంతో అందరూ ఆనంద పరవశులయ్యారు.. ఈ అరుదైన దృశ్యం నెల్లూరు జిల్లా, కలువాయి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది... ఎక్కడి నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో తెలియదు గానీ, నెమలి జనావాసాల మధ్యకు రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు... కొందరు యువకులు ఆ నెమలిని సురక్షితంగా పట్టుకొని, పోలీసుల సమక్షంలో, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.. బస్టాండ్ లో కనిపించిన నెమలిని చూసేందుకు జనం ఎగబడడమే కాదు.. ఈ అందమైన దృశ్యాన్ని తమ ఫోన్లలో తీసి భద్రపరుచుకున్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.